క్లుప్తంగా

గ్రామాల్లో డీపీవో పర్యటన



కంపోస్ట్ షెడ్‌ను పరిశీలిస్తున్న డీపీవో

దండేపల్లి: మండలంలోని గుడిరేవు, అల్లీపూర్, దండేపల్లి గ్రామాల్లో డీపీవో వెంకటేశ్వర్లు గురువారం పర్యటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలను సందర్శించి రికార్డులు, రిజిస్టర్లు తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. నర్సరీలు, కంపోస్ట్ షెడ్‌లు పరిశీలించారు. తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. పారిశుధ్యం లోపించకుండా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు శ్రీలత, శ్రీహరి ఉన్నారు.

'ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేట్ పరం'

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తుందని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపించారు. మంచిర్యాలలో గురువారం పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల హామీల్లో చెప్పినట్లుగా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన విషయం తుంగలో తొక్కిందన్నారు. మోదీ పాలన పూర్తిగా బడా కార్పొరేట్ వ్యక్తుల సంక్షేమం కోసమే పనిచేసిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు శ్రీనివాస్, సల్మాన్‌పాషా, క్రాంతికుమార్, నితీష్, అభిరామ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక పూజల్లో అర్చకుడు, సిబ్బంది

మంచిర్యాలఅర్బన్: స్థానిక విశ్వనాథస్వామి దేవస్థానంలో వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి వైశాఖ మాస ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అర్చకుడు బాలక్రిష్ణ ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారికి కుంకుమ పూజ అభిషేకంతో పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 18న శ్రీ వాసవి జయంతి, అమ్మవారికి విశేషపూజలు, అర్చన, శోభయాత్ర, ఉంజలి సేవ, 23న శాకంబరి ఉత్సవం, జూన్ 2న దీపోత్సవం, జూన్ 6న లక్షపుష్పార్చన ప్రత్యేక కార్యక్రమాలుంటాయని ఈవో ముక్తారవి తెలిపారు. స్థానిక అమ్మవారిని వాసవి క్లబ్ సభ్యులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కరెంట్ కోతలు విధిస్తున్నా.. పట్టించుకోరా..?

భీమారం: మండలంలో గంటల తరబడి విద్యుత్ కోతలు విధిస్తున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నాయకులు, చెన్నూర్ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ బుక్యా రాజ్‌కుమార్ నాయక్ ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కరెంట్ కష్టాలు ప్రారంభమయ్యాయన్నారు. ఈ విషయంలో విద్యుత్ శాఖ అధికారులతో పాటు సబ్‌స్టేషన్‌కి ఫోన్ చేస్తే స్పందించడం లేదన్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకొని కోతలు తగ్గించకపోతే, విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ప్రజలతో కలిసి ధర్నా చేస్తామని రాజ్‌కుమార్ నాయక్ హెచ్చరించారు.

ప్రతీ కూలీకి పనికల్పిస్తాం



కూలీలతో మాట్లాడుతున్న ఏపీఎం జీనత్

భీమారం: ఉపాధిహామీ పథకం ద్వారా ప్రతికూలీకి పనికల్పిస్తామని ఏపీఎం జీనత్ పేర్కొన్నారు. భీమారంలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆమె సందర్శించారు. వేసవి ఎండల నుంచి కూలీలకు ఉపశమనం కల్పించేందుకు గ్రీన్‌షెడ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మండల సభ వాయిదా

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి తెలిపారు.

వేధిస్తున్న సిబ్బంది కొరత..!

- పశువైద్యశాలల్లో ఇన్‌చార్జీలతో కాలం వెల్లదీత
- ఇబ్బందుల్లో రైతులు
- పట్టించుకోని అధికారులు



మండల కేంద్రంలోని పశువుల ఆసుపత్రి

లక్సెట్టిపేట: మండలంలోని పశువైద్యశాలల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. అరకొర సిబ్బందితో సేవలందిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో మొత్తం పద్దెనిమిది గ్రామ పంచాయతీలుండగా, పశువైద్యశాలలకు పశువులను తీసుకొస్తే సిబ్బంది కొరత కారణంగా పూర్తిస్థాయి వైద్యం అందడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పశువులకు సోకే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశువైద్యులు, సిబ్బంది అవగాహన కల్పించాల్సి ఉండగా అవేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

మండలంలోని సిబ్బంది వివరాలు..

వైద్యాధికారి ఏడీ లేకపోవడంతో దండేపల్లి వైద్యాధికారి ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. రంగపేట, పోతపల్లి రెండు గ్రామాల్లో ప్రాథమిక పశువైద్య కేంద్రాలు ఉన్నాయి. రంగపేటలో వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండడంతో కంపౌండర్‌తో కాలం వెల్లదీస్తున్నారు. పోతపల్లిలో వైద్యాధికారి, అటెండర్ ఉన్నారు.. వెటర్నరీ అసిస్టెంట్ లేదు. వెంకట్రావుపేట, దౌడపల్లి గ్రామాల్లో పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నాయి. ఇందులో వెటర్నరీ అసిస్టెంట్ ఉండగా, అటెండర్ లేడు. దౌడపల్లిలో వెటర్నరీ అసిస్టెంట్ ఇన్‌చార్జి ఉన్నాడు. అటెండర్ లేడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని సిబ్బంది కొరత తీర్చి, అన్ని ఆసుపత్రులలో పూర్తిస్థాయి రెగ్యూలర్ సిబ్బందిని కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

సిబ్బంది కొరత ఉంది

ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉంది. పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడంతో సేవలందించలేకపోతున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో పశువులు చాలా ఎక్కువగా ఉన్నాయి. మందులు కూడా రెగ్యూలర్‌గా సరఫరా చేయాలి. గడ్డి విత్తనాలపై ప్రజలు ఎక్కువ ఆసక్తితో ఉన్నారు. వాటి సరఫరా పెంచాలి. సిబ్బంది కొరత లేకుండా చేస్తే పూర్తిస్థాయిలో వైద్యం అందుతుంది.

– ధన్‌రాజ్, ఇన్‌చార్జి ఏడీ, లక్సెట్టిపేట

ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక



మాట్లాడుతున్న ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి



భీమినిలో సమావేశంలో పాల్గొన్న అధికారులు

భీమిని: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఉపాధిహామీ 13వ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందునా ఎవరినీ ఆహ్వానించలేదని ఎంపీడీవో గంగామోహన్ తెలిపారు. ఏప్రిల్ 23 నుంచి మార్చి 2024 ఆర్థిక సంవత్సరం వరకు రూ.2.12 కోట్ల ఖర్చుతో వివిధ రకాల పనులను చేసినట్లు అధికారులు వెల్లడించారు. మండలంలో 10 బృందాలతో ఎస్ఆర్‌పీలు, వీఎస్‌లు గ్రామాల్లో పనులను తనిఖీ చేసి పనుల్లో అవకతవకలను గుర్తించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ కిషన్ మాట్లాడుతూ.. గ్రామపంచాయతీల్లో చేపట్టిన పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించిన వారికి రూ.10వేల జరిమానా విధించారు. రూ.58,949 రికవరీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో దత్తరావు, ఎంపీడీఓ గంగామోహన్, ఎంపీఓ సబ్దర్ ఆలీ, ఏపీఓ భాస్కర్‌రావు, విజిలెన్స్ అధికారులు సురేష్, స్టేట్ క్వాలిటీ అధికారి చంద్రశేఖర్, డీఆర్పీలు, సాంకేతిక సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేమనపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామపంచాయతీల్లో కూలీలకు పనులు కల్పించాలని, నర్సరీలలో మొక్కల పెంపకం పూర్తి చేసి రాబోయే హరిత హారానికి మొక్కలను సిద్ధం చేయాలన్నారు. తాగునీటి సరఫరా, ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఓ సత్యప్రసాద్, ఈసీ మధుకర్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

హాజీపూర్‌లో నేడు...

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎంఎస్ఆర్ ఈజీఎస్) అమలుపై శుక్రవారం హాజీపూర్ మండల ఎంపీపీ కార్యాలయంలో 3వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూధన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు చేపట్టిన 350 పనులకు సంబంధించి రూ. 2.39 కోట్ల విలువ గల పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికలో నివేదికలపై బహిరంగ చర్చ ఉంటుందని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, సామాజిక తనిఖీ సిబ్బంది హాజరు కావాలని అన్నారు.

బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలి



జిల్లా కేంద్రంలో ప్రచారం చేస్తున్న రఘునాథ్



భీమినిలో ఉపాధిహామీ పనుల వద్ద...



చెన్నూర్: ప్రచారం చేస్తున్న యువతులు

మంచిర్యాలటౌన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి నుంచి బీజేపీ నుంచి పోటీ చేస్తున్న గోమాసే శ్రీనివాస్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి కోరారు. జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి వాడలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మోతె సుజాత, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

భీమిని: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పట్టి వెంకటకృష్ణ అన్నారు. భీమిని మండలంలోని వెంకటాపూర్, మల్లీడి, కన్నెపల్లి మండలంలోని సుర్జాపూర్, కన్నెపల్లి గ్రామాల్లో గురువారం ఉపాధిహామీ కూలీలతో మాట్లాడారు. పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో భీమిని, కన్నెపల్లి మండలాల అధ్యక్షులు కొంక సత్యనారాయణ, రామయ్య యాదవ్, నాయకులు వెంకటేష్, శ్రీనివాస్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలో ఆదర్శనగర్, శ్రీనగర్ కాలనీలలో కొండపాక శ్రీవాణి ఆధ్వర్యంలో యువతులు, మహిళలు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ యువతులు గురువారం గడపగడపకూ ప్రచారం నిర్వహించారు.

చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి, లింగంపల్లి గ్రామాల్లో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు.

నాంచారమ్మ జాతరకు నిధులు కేటాయించండి



మాట్లాడుతున్న బాపు

నస్పూర్: ములుగు జిల్లా వెంకటాపురం మండలం రామానుజపురం గ్రామంలో ఈ నెల 23న నిర్వహించే ఎరుకల నాంచారమ్మ జాతరను విజయవంతం చేయాలని జిల్లా ఎరుకల సంఘం అధ్యక్షుడు దుగ్యాల బాపు పిలుపునిచ్చారు. నాయకులతో కలిసి గురువారం ఆయన నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్ ఆవరణలో మాట్లాడారు. సుమారు 800 ఏళ్ల క్రితం కాకతీయ రాజులు నిర్మించిన నాంచారమ్మ ఆలయం వద్ద జాతరను ఏటా ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాముఖ్యతను కల్పించి అధిక నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లోకిని రవి, జిల్లా కోశాధికారి సార్ల సంపత్, మండల అధ్యక్షుడు కేంసారం సారయ్య, బెల్లంపల్లి మండల అధ్యక్షుడు శ్రీరాముల రమేశ్, చెన్నూర్ మండల అధ్యక్షులు దుగ్యాల సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి



ఊట్లలో గిరిజనులతో మాట్లాడుతున్న దివాకర్‌రావు

- కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించండి
- మంచిర్యాల బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు

కోటపల్లి/దండేపల్లి/లక్సెట్టిపేట/భీమారం/నెన్నెల/శ్రీరాంపూర్: బీఆర్ఎస్ హయంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని బీఆర్ఎస్ మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. దండేపల్లి మండలంలోని నాయికపుగూడెం, అర్జుగూడ, సామగూడెం, మామిడిగూడెం, దమ్మన్నపేట, కంచరబాయి, ఊట్ల, గిరిజన గ్రామాల్లో, లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 5, 12, 13వ వార్డులలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజల అభివృద్ధి కోసం కృషి చేశామన్నారు. నిత్యం విద్యుత్ సమస్య లేకుండా సరఫరా అందించామన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కోటపల్లి మండలం వెంచపల్లి, సుపాక, జనగామ, ఆలుగామ గ్రామాల్లో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు విద్యాసాగర్, భీమారంలో మండల పార్టీ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. నెన్నెలలో ఉపాధిహామీ పనుల వద్ద పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేష్, శ్రీరాంపూర్‌లోని కార్మిక వాడల్లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, టీబీజీకేఎస్ నేతలతో కలిసి 16, 17 వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. లక్సెట్టిపేటలో మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, దండేపల్లిలో వైస్ ఎంపీపీ పసర్తి అనిల్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, నెన్నెలలో జెడ్పీటీసీ సింగతి శ్యామల–రాంచందర్, ఎంపీపీ సంతోషం రమాదేవి, కో ఆప్షన్ సభ్యుడు ఇబ్రహీం, ఎంపీటీసీ పురంశెట్టి తిరుపతి, శ్రీరాంపూర్‌లో పట్టణ అధ్యక్షుడు సుబయ్య, కార్యదర్శి పవన్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ప్రజల గొంతు వినిపిస్తా

- ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మోసపూరిత మాటలతో ప్రజల ముందుకొస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌లకు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని, బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలిచి తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజల గొంతు వినిపిస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. హాజీపూర్ మండలం దొనబండ శివారులోని శ్రీసాయి గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రజల సమస్యలపై నిత్యం స్పందిస్తూ అందుబాటులో ఉంటానని, 13న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మొగిళి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'బీజేపీ, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పండి'



రోటిగూడలో ప్రచారంలో జాన్సన్‌నాయక్

జన్నారం: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం జన్నారం మండలం రోటిగూడ, ముహ్మదబాద్, జన్నారం గ్రామ పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ హయాంలో కరువు ముంచుకొస్తుందని, బీజేపీ పాలకులు రాష్ట్రానికి చేసిందేమి లేదని ఆరోపించారు. రాష్ట్రంలో అభివృద్ధి బీఆర్ఎస్‌తో సాధ్యమవుతుందన్నారు.

ఎంపీగా అవకాశం ఇవ్వండి

- బీఎస్పీ అభ్యర్థి ఇరుకుళ్ల రాజనర్సయ్య



మాట్లాడుతున్న ఇరుకుళ్ల రాజనర్సయ్య

బెల్లంపల్లి/మందమర్రిరూరల్/నస్పూర్: పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్లను తొలగిస్తామని ప్రకటించిన బీజేపీ పార్టీని చిత్తుగా ఓడించాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి ఇరుకుళ్ల రాజనర్సయ్య అన్నారు. బెల్లంపల్లి, మందమర్రి, నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌ల్లో గురువారం ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏనుగు గుర్తుకు ఓటు వేసి బీఎస్పీని గెలిపించాలని కోరారు. సమావేశాల్లో బీఎస్పీ పార్లమెంట్ ఇన్‌చార్జి క్యాదాసి రవీందర్, జిల్లా ఇన్‌చార్జీలు అరికిల్ల మల్లేష్, బాల కళ్యాణ్, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



బెల్లంపల్లిరూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్



కన్నెపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీఎస్సార్



మాట్లాడుతున్న హైమావతి, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఓదెలు

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణను ఆదరించాలి
- ప్రచారంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్

బెల్లంపల్లిరూరల్/తాండూర్/దండేపల్లి/లక్సెట్టిపేట/మంచిర్యాలరూరల్(హాజీపూర్)/వేమనపల్లి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, కాంగ్రెస్ పాలనలోనే గ్రామాలు అభివృద్ధి పథంలోకి వచ్చాయని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. దండేపల్లి మండలం కన్నెపల్లిలో, లక్సెట్టిపేట మున్సిపల్ పరిధిలో, హాజీపూర్ మండలంలోని గుడిపేటలో కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు వంశీకృష్ణకు మద్దతుగా ప్రచారం నిర్వహించగా, బెల్లంపల్లి మండల పరిధిలోని బట్వాన్‌పల్లి, పెర్కపల్లి, కన్నాల గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో, తాండూర్ మండలంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ పాల్గొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు చేసిన అభివృద్ధి ఏమీ లేదని, కార్పొరేట్ వ్యవస్థలకు కొమ్ముకాసాయని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం పలువురు పార్టీలోకి చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. తాండూర్‌లో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు ఈసా, ఎంపీటీసీ సిరంగి శంకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్ రావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మహేందర్ రావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ రత్నాకర్ రావు పాల్గొనగా, బెల్లంపల్లిలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సింగతి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

'బెల్లంపల్లి రూపు రేఖలు మారుస్తా'

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏఎంసీ క్రీడా మైదానంలో జరిగిన బహిరంగ సభకు రాష్ట్రమంత్రి శ్రీధర్‌బాబు హాజరవుతారని ప్రచారం చేయగా అనివార్య కారణాల వల్ల మంత్రి రాలేకపోయారని ఎమ్మెల్యే వినోద్ తెలిపారు. మూడు నెలల్లో బెల్లంపల్లి రూపు రేఖలు మారుస్తానని, పుర ప్రజలకు గోదారి నీళ్ల అందించడానికి కార్యాచరణ జరుగుతోందన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం ఇంజనీరింగ్ కళాశాల మంజూరు కోసం పాటు పడుతున్నానని, ఎన్నికల తంతు ముగిశాక ఆ కోరిక నెరవేరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

'బీజేపీ, బీఆర్ఎస్‌లకు గుణపాఠం చెప్పండి'

చెన్నూర్/తాండూర్/బెల్లంపల్లి: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు తగిన రీతిలో గుణపాఠం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యుడు దాగం రాజారాం, సీపీఐ చెన్నూర్ నియోజకవర్గ కార్యదర్శి మిట్టపల్లి పౌల్ అన్నారు. బీజేపీ బీఆర్ఎస్ పార్టీలు దేశ, రాష్ట్ర ప్రజల బాధలను పట్టించుకోలేదని ఆరోపించారు. ఆ రెండు పార్టీలను చిత్తుగా ఓడించి బుద్ధి చెప్పాలని, సీపీఎం పార్టీ బలపరుస్తున్న గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బెల్లంపల్లి పట్టణ సీపీఐ కార్యాలయంలో సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు జీ.అశోక్, రమణ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కోటపల్లి/మందమర్రిరూరల్: వంశీకృష్ణను గెలిపించుకుంటే పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అనేక అనుబంధ పరిశ్రమలు వస్తాయని రాష్ట్ర ఎస్సీ సెల్ కో ఆర్డినేటర్, కాంగ్రెస్ పార్టీ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి హైమావతి అన్నారు. సేవ చేయాలని వచ్చిన యువ పారిశ్రామిక వేత్తను ఆదరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు పాల్గొన్నారు. కోటపల్లి మండలం నక్కలపల్లి, మల్లంపేట, కొండంపేట, నాగంపేట, బొప్పారం, పిన్నారం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్సీ సతీశ్‌కుమార్ ప్రచారం నిర్వహించారు.

గడ్డం వంశీకృష్ణకు సంపూర్ణ మద్దతు

నస్పూర్: కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు గొల్లకుర్మ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజన్న యాదవ్ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన గాండ్ల సమ్మయ్య



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే వివేక్

రామకృష్ణాపూర్: బీఆర్ఎస్ పార్టీకి ఇటీవల రాజీనామా చేసిన రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు గాండ్ల సమ్మయ్య గురువారం చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. సమ్మయ్యతో పాటు పలువురు నాయకులు పార్టీలో చేరగా వారిని ఆహ్వానించారు.

భారీగా చేరికలు

రామకృష్ణాపూర్: పట్టణానికి చెందిన ఆయా కులసంఘాల బాధ్యులు, యువకులు గురువారం రాత్రి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. స్థానిక సూపర్‌బజార్ సెంటర్లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో వివేక్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. తన కుమారుడు గడ్డం వంశీని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

లక్సెట్టిపేట: మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఏసీపీ ప్రకాశ్ గురువారం పరిశీలించారు. ఈ నెల 13న జరగనున్న ఎంపీ ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం కొనసాగేలా చూడాలని, ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఓటర్లకు గుర్తింపు కార్డు తెచ్చుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ నరేందర్, ఎస్సై ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

దండేపల్లి: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దండేపల్లి మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను రూట్ మొబైల్ సిబ్బందితో కలిసి ఎస్సై భూమేష్ గురువారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తగిన వసతులు, పరిశీలించారు. ఆయన వెంట ఏఎస్సై పాల్, సిబ్బంది ఉన్నారు.